కథా నిలయం
శ్రీకాకుళం

# బిచ్చి

రాత్రి తొమ్మిది గంటలయింది.

పెద్దబజారు ఇంకా రద్దీగానే ఉంది. విశాల మైన రోడ్డుకు ఒక వైపు స్కూటర్లు, కార్లు సిటీబస్సులు.. మరొకవైపు సైకిళ్ళు, రిక్షాలు ప్రవాహంలా పరుగులు పెడుతున్నాయి. కొన్ని దుఖాణాలు అప్పటికే మూతపడుతున్నాయి. మూతబడని దుకాణాల్లో కొసరు బేరాలు కొన్ని కొనసాగుతున్నాయి...

నియాన్ లైట్ల పచ్చటి వెలుగులో ట్యూబు లైట్ల తెల్లటికాంతిలో... పెద్దబజారు పట్టపగలు లాగే వెలిగిపోతూంది..... ఆరోజు శుక్రవారం రోడ్డుకు అటూ ఇటూగా ఉన్న దుకాణాల్లో అమ్మవారికి పూజలు జరుగుతున్నాయి. ఆ రద్దీలో ... రొదలో ... పురోహితుల మంత్రోచ్ఛారణ మంద్రంగా వినబడుతుంది. సాంబ్రాణీ ధూపాల పొగలతో.. అగరువత్తుల సుగంధాలతో.. హడావుడిగా పూజలు జరిపించి, పంచెలు సర్దుకుంటూ, మరో దుకాణంలోకి పరుగులు తీస్తోన్న పురోహితులతో.. ఆరోజు అమ్మకాల బేరసారాల, ఆలోచనలతో.. లాభ నష్టాల బేరీజులతో...

దుకాణాలన్నీ తమ తమ దైనందిన వ్యాపారాలకు మంగళం పాడుతున్న వేళ...!

అప్పలశెట్టి కిరాణా కొట్లో, పురోహితుడు కూడా పూజాదికాలు నిర్వర్తిస్తున్నాడు. పాత నిమ్మకాయల స్థానే, నవనవలాడుతూన్న మూడు కొత్త నిమ్మకాయలను తీగెకు గుచ్చాడు. మధ్యగా ఓ మిరపకాయ తగిలించి, దాన్నికొట్టు బయట కొక్కేనికి వ్రేలాడదీశాడు. గల్లాపెట్టెలో ఉన్న పాత నిమ్మకాయల్ని రోడ్డు మీదకు విసిరి, కొత్త నిమ్మకాయలు ఆ పెట్టెలో ఉంచాడు.

ఒక కొబ్బరికాయ కొట్టి, అమ్మవారి పటం చుట్టూ నీళ్ళు చల్లి.. రెండు చెక్కలూ నైవేద్యం పెట్టాడు. మరో కొబ్బరికాయకు ముచ్చిక తీశాడు. మూడు కళ్ళూ ఉన్న చోట ముద్దకర్పూరం ముక్క పెట్టాడు. అగ్గి పుల్ల గీసి హారతి వెలిగించేడు. గంట గణాగణా వాయించి అమ్మవారి మంగళ స్తుతి చేశాడు....

అప్పలశెట్టి భక్తి పూర్వకంగా పురోహితుడి చేతిలోని హారతి కళ్ళ కద్దుకుని పళ్ళెంలో దక్షిణ వేశాడు. పురోహితుడు దక్షిణ తీసుకుని, ముచ్చిక తీసిన కొబ్బరికాయను శెట్టి చేతిలో పెట్టి... ఓ నమస్కారం పెట్టి... బయటకు వెళ్ళిపోయాడు.

అప్పలశెట్టి భారీకాయంతో కుర్చీలోంచి లేచాడు. కొబ్బరికాయను చేత్తో పట్టుకుని మూడుసార్లు గల్లా పెట్టె చుట్టూతిప్పాడు. దుకాణం మెట్లు దిగి అరుగు క్రిందకు వచ్చాడు. పని వాళ్ళు కొట్టు తలుపులు మూసి.. తలుపుల మీద పొడుగాటి గెడబిగించి తాళం కప్పలు

వేశారు, తాళం చెవుల గుత్తినిశెట్టి గారి చేతిలో పెట్టారు...

అప్పలశెట్టి తన కొట్టు వైపు తిరిగి కొబ్బరికాయను గాల్లో చుట్టూ తిప్పి దిష్టి తీసి.. శక్తి కొద్దీ రోడ్డు కేసి కొట్టాడు. కొబ్బరికాయ పగిలి మూడు చెక్కలయింది. మూడు చెక్కలు మూడు వైపులకి చెల్లా చెదురుగా పడ్డాయి. చెల్లాచెదురయిన ఆ కొబ్బరి చెక్కల మీద సుడిగాలిలా విరుచుకుపడ్డారు ముగ్గురు కుర్రాళ్ళు.. పదీ పదకొండు పన్నెండేళ్ళ వయసు వాళ్ళు... ఎక్కడ నుంచి వచ్చారో ఎక్కడ పొంచి ఉన్నారో.. ఆ రోడ్డు మీద వీధి లైట్ల... చీకటి వెలుగుల మధ్య నీడల్లా, క్రీనీడల్లా ఒకరి మీద ఒకరు పడి ఆశగా... ఆత్రంగా.. ఆబగా.. కొబ్బరి చెక్కల్ని ఏరుకుంటున్నారు.

పోలయ్యనే పోలిగాడికి రెండు పెద్ద చెక్కలు దొరికాయి. నర్సింహులనే నర్సిగాడికి చిన్న ముక్కే చిక్కింది. అప్పయ్యనే ఎర్రప్పడికి కొబ్బరిచెక్క దక్కలేదు.

పోలిగాడు నిట్రాటలా ఉన్నాడు. నల్లగా నిగనిగలాడుతున్నాడు. నిక్కరు తొడుక్కున్నాడు. వాడికి ఒంటి మీద చొక్కా లేదు.

నర్సిగాడికి ఒంటి మీద బనీను ఉంది. నిక్కరు ఉంది. నిక్కరూ, బనీను చిరిగి పీలికలుగా వ్రేలాడుతున్నాయి. ఎర్రప్పడికి ఒంటి నిండా మోకాళ్ళు దిగిపోయిన పొడవాటి చొక్కా ఉంది. చొక్కా లోపల నిక్కరు ఉందో లేదో తెలియదు.

ముగ్గురి చేతుల్లోనూ చిన్న చిన్న సిమెంటు గోనె గుడ్డ సంచులున్నాయి. పోలిగాడు తనకు దొరికిన రెండు కొబ్బరి చెక్కల్నీ సంచీలో వేసుకుని - గబుక్కున భుజానికి తగిలించుకున్నాడు. "ఎదవ ఎదురుబద్దనాగున్నాడు.. సెక్కలన్నీ ఈడే ఎగరేసుకుపోతన్నడు... "

ఎర్రప్పడు పోలిగాడ్ని చూస్తూ తిట్టుకున్నాడు. నిరాశగా నిలబడ్డ ఎర్రప్పడు వెనక్కి నీడల్లా వచ్చి నిలబడ్డారు వరాలు , గౌరీ.. వాళ్ళిద్దరూ అక్కాచెల్లెళ్ళే... ! వరాలు పీలగా ఉంది. పిండి బొమ్మలా తెల్లగా ఉంది మాసిన పరికిణీ జాకెట్టు వేసుకుంది. గౌరి కుంటిది. మోకాలు మీద చేయి నానుకుని నెమ్మదిగా నడుస్తుంది. గౌరి చిరుగుల గౌను తొడుక్కుంది. రెండు జడలున్నాయి. ఇద్దరి చేతుల్లోను గోనెగుడ్డ సంచులున్నాయి. అక్కా చెల్లెళ్ళిద్దరికీ ఆశించినంతగా, కొబ్బరి చెక్కలు దొరకలేదు. వాళ్ళూ పోలిగాడి వైపు ఈర్ష్యగా చూశారు.

పోలిగాడు, డేగకళ్ళతో రోడ్డు మీదకు దృష్టి సారిస్తున్నాడు. వాడు నిలబడ్డ చోటుకు ఎదురుగా ఉన్న ఎస్సార్ఎమ్టీ సందు లోంచి మరో నలుగురు కుర్రాళ్ళు జట్టుగా రోడ్డు మీదకు వచ్చి పోలిగాడ్ని దాటి కేకలు పెట్టుకుంటూ ముందుకు పోయారు. వాళ్ళ చేతుల్లోనూ గోనెగుడ్డ సంచులున్నాయి. పోలిగాడు వాళ్ళని గమనించి, తనూ ముందుకు పరుగెట్టాడు.

"అల్లదిగోనే గౌరీ! ఆ కొట్టుకాడ కొబ్బరి కాయలు కొడతాన్రు!" పోలిగాడ్ని అనుసరిస్తూ వరాలు అరిచింది. వరాల్ని అందుకుంటూ గౌరి కుంటికాలుతో గబగబా

అడుగులు వేసింది... గౌరి కంటే ముందు నర్శిగాడు.. ఎర్రప్పడు దౌడుతీశారు...

" లింగం క్లాత్ స్టోర్స్" వాళ్ళు రెండు కొబ్బరికాయలు దిష్టి తీసి ఫట్ ఫట్ మని రోడ్డు మీద కొట్టారు. కొబ్బరికాయలు పగిలి చెక్కలయి ముక్కలయ్యాయి. కుర్రాళ్ళంతా పగిలిన ఆ చెక్కల కోసం, ముక్కల కోసం... కాట్ల కుక్కల్లా కలియపడ్డారు. ఈ సారి కూడా పోలిగాడికి మూడు చెక్కలుదొరికాయి.... నర్సిగాడికి చిన్న ముక్క దొరికింది. మిగతా కుర్రాళ్ళు ఒక్కో ముక్క దక్కించుకున్నారు. వరాలు, గౌరీ తెల్ల మొహాలు వేశారు... ఎర్రప్పడికి ఏవీ దొరకలేదు.. పోలిగాడి వైపు ఎర్రప్పడు గుర్రుగా చూశాడు.. నర్శిగాడు పళ్ళు కొరికాడు.. వరాలు, గౌరీ కొరకొరా చూశారు.. కొట్ల ముందు కొబ్బరి చెక్కలన్నీ పోలిగాడి పరం గావడం.. వాళ్ళందరికీ కడుపుమంటగా ఉంది.

రోడ్డుకు అటు ఇటూగా, గుంపులుగా గోలగా ఒక దుకాణం తరువాత ఒకటి, దిష్టి కొబ్బరి చెక్కల్ని ఏరుకుంటూ.. రోడ్డు మీద వాహనాల్ని తప్పించుకుంటూ వాళ్ళు పరుగెడుతున్నారు. ఫుట్‌పాత్‌ల మీద రోడ్డుమీద జనం ఈ కుర్రాళ్ళని వింతగా చూస్తూ ఎడంగా నడుస్తున్నారు. రోడ్డు పొడవునా దిష్టి తీసిపడేసిన నిమ్మకాయలు, మిరపకాయలు, పసుపు నీళ్ల కొబ్బరి చెక్కలు ఏవో భయాలకీ, నమ్మకాలకి ప్రతీకలుగా కనపడుతున్నాయి. చూసేవాళ్ళ గుండెల్లో చిరు అలజడి సృష్టిస్తున్నాయి.

రాత్రి తొమ్మిదిన్నర... !

"కృష్ణా ఎంపోరియమ్" పనివాళ్లు కొట్టు తలుపులు దబదబా మంటూ మూస్తున్నారు. కుర్రాళ్ళంతా కేకలు పెడుతూ, తోసుకుంటూ తొక్కుకుంటూ ఆ కొట్టు వైపు పరుగెత్తారు... వాళ్ళ ఆశ, ఆనందం, ఆకలి, ఆరాటం, పోరాటం, అన్నీ ఆ దిష్టి కొబ్బరి చెక్కలే!

ఆ పోరాటంలో అందరికంటే ముందు 'పోలిగాడు' పరుగెడుతున్నాడు. పోలిగాడికి పరమానందంగా ఉంది, వాడి భుజానికున్న కొబ్బరి చెక్కల సంచిలో ఎన్ని దిష్టి చెక్కలు ఎక్కువ దొరికితే ... అన్ని ఎక్కువ డబ్బులు జేబులో రాల్తాయి... పెద్దదయితే కొబ్బరి చెక్క ఒకటికి రూపాయి.. చిన్నదయితే అర్ధరూపాయి పలుకుతాయి... పోలిగాడు శుక్రవారం ఒకే రోజు కొబ్బరి చెక్కలు ఏరుకుంటాడు. మిగతా రోజుల్లో పెంటకుప్పలమీద చిత్తుకాగితాల్ని గోనె సంచుల్లో నింపుతాడు. పోలిగాడి తల్లీ, తండ్రీ కుళ్ళు కాలువల్లో చేటలతో జల్లెడలు వేస్తుంటారు... ఎన్ని జల్లెడలు వేసినా, ఎంత కెలికినా వాళ్ళకు నిత్యం దొరికేవి- ఇనుపముక్కలే.. మిగిలేవి బురద చేతులే... ఎప్పుడో గాని విలువైన వస్తువేదీ దొరకదు.... పోలిగాడు పొద్దస్తమానం కష్టపడతాడు. రోడ్లమీద, వీధుల్లోను అలసట లేకుండా తిరుగుతాడు. సాయంత్రమయ్యేసరికి ఎలాగోలా... ఎంతో కొంత సంపాదిస్తాడు. పదో పరకో తల్లి చేతుల్లో పెడతాడు. ఆపై మిగిలితే మాత్రం సినిమాలు చూస్తాడు. పోలిగాడికి సిన్మాల పిచ్చి... ముప్పొద్దులా మూడాటలు, వరుసబెట్టి చూస్తాడు... అలా చూస్తే గాని

వాడికి తృప్తి ఉండదు... "సత్యగౌరి' టాకీసులో చిరంజీవి' కొత్త బొమ్మొచ్చింది. ఆ బొమ్మని ఎప్పుడెప్పుడు చూద్దామన్న కోరిక... దిష్టి కొబ్బరిచెక్కలతో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆరాటం... వాడి బుర్రలో గిరికీలు కొడుతున్నాయి. దాదాపు పిల్లలందరివీ రోడ్డున పడ్డ బ్రతుకులే... !

నర్శిగాడి తల్లీ, తండ్రీ బస్టాండులో కళాసీ పని చేస్తారు... వాళ్ళలా పనిలోకి వెళ్ళగానే వీడు రోడ్డున పడతాడు. వరాలు గౌరికీ తండ్రి ఉన్నా లేనట్టే రేచర్లపేటలో వాడు మరో ఆడదాన్ని ఉంచుకున్నాడు... తల్లి మునసబుగారి తూము వద్ద పొంగడాలు, పాకం ఉండలు, అమ్ముకుంటుంది.

ఎర్రప్పడికి తండ్రి లేనే లేడు. తల్లి పాచిపని చేస్తుంది. మిగిలిపోయిన అన్నం కూరలు తెచ్చి కాలక్షేపం చేస్తుంది. ఎర్రప్పడికి ఆ అన్నం నచ్చదు కూరలూ నచ్చవు. నచ్చక పోయినా తింటాడు. తినకపోతే తల్లి నెత్తిమీద మొట్టికాయలు వేస్తుంది...

ఎర్రప్పడికి, ఎన్నాళ్ళ నుంచో కోడికూర తినాలని ఉంది. కనీసం కోడి పకోడీలు కొనుక్కోవాలని ఉంది. ప్రతీరోజు సినిమా రోడ్డులో చికెన్ కొట్ల ముందు నిలబడి, కోడి మాంసం ఎర్రెర్రగా నూనెలో వేపడం... వాడు కళ్ళారా చూస్తున్నాడు. దిష్టి కొబ్బరి చెక్కలు అమ్మగా వచ్చిన డబ్బులతో కోడి పకోడీలు పొట్లాం కట్టించుకోవాలని ఉంది..... ఆ పొట్లాం అమ్మకు హఠాత్తుగా చూపించి ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఉంది.... ఆ ఆశ తీరే దారి కనిపించడంలేదు.

"కృష్ణా ఎంపోరియమ్" వద్ద కొబ్బరి చెక్కల్నీ కూడా పోలిగాడు ఆక్రమించుకున్నాడు. అందర్నీ అదిలించి కొట్టాడు. ఎర్రప్పడికి ఒక చెక్క అందినట్టే అంది అందకుండా పోయింది. దాన్నీ పోలిగాడు తన పరం చేసుకున్నాడు...

ఎర్రప్పడికి ఒళ్ళు మండిపోయింది. ఉక్రోషం తన్నుకు వచ్చింది.

"నంజికొడకా! ఆ సెక్క నాదీ...! నేయంగా నాకిచ్చీ!" ఎర్రప్పడు గొడవ పెట్టాడు.

"నాకు దొరికినాది.. నానెందుకివ్వాల...? నానివ్వను.." పోలిగాడు ఎదురుతిరిగాడు.

"దొంగనమ్మికొడకా! ఆ సెక్కనాదీ! నాకిచ్చీ! తొల్లీతగా సెక్కమీద - నా సెయ్యే పడ్డాదిరా! ఒగ్గేయ్!"

"నా సెయ్యీ పడ్డాది... నా నొగ్గేయనారేయ్.! ఏటి సేసుకుంతావో - సేస్కో..." పోలిగాడు బిగుసుకుపోయాడు.ఎర్రప్పడు. అమాంతం పోలిగాడిమీద పడ్డాడు. కలియబడి, పోలిగాడి మెడ పట్టుకుని కిందకు పడగొట్టాడు. ఇద్దరూ నేల మీదకు దొర్లారు. ఒకరి మీద ఒకరు పడి దొర్లడంలో ఎర్రప్పడు మెరుపులా పైకి లేచాడు. పోలిగాడి చేతిలోని కొబ్బరి చెక్కను లాక్కుంటూ పెనుగులాడుతున్నాడు...

పోలిగాడు దాన్ని వదిలిపెట్టలేదు. ఎర్రప్పడి డొక్కలో శక్తి కొద్దీ మోకాలితో ఒక్క తాపు తన్నాడు. విసురుగా మోచేత్తో మూతి మీద ఒక్క పోటు పొడిచాడు.

" ఓలమ్మోయ్! బాబోయ్!" ఎ(ర్రప్పడు వెల్లకిలాపడిపోయాడు... ఏడుస్తున్నాడు. ఎవరైనా తనకు తోడు వస్తారోమోనన్న ఆశతో చుట్టూ చూస్తున్నాడు... ఎవరూ లేరు... వరాలు, గౌరిసంత చెరువు కొట్లవైపు చల్లగా జారుకున్నారు. నర్శిగాడు, మిగతా కుర్రాళ్ళు " కోటయ్య స్వీట్‌స్టాల్" ముందు కొబ్బరి చెక్కల్ని ఏరుకుంటున్నారు.

జనం వీళ్ళ దెబ్బలాటని, ఉత్సాహంతో చూస్తున్నారు తప్ప ఎవరూ విడదీయటం లేదు. ఎ(ర్రప్పడు వెల్లకిలా పడడంతో, అదే అదునుగా పోలిగాడు తప్పించుకుని పారిపోబోయాడు. ఎ(ర్రప్పడు వాడ్ని వదలలేదు... రెండు కాళ్ళూ పట్టుకున్నాడు. కొండ చిలువలా చుట్టుకున్నాడు." నా సెక్క నాకిచ్చీరా!" ఏడుస్తున్నాడు.. వెక్కివెక్కి పడుతున్నాడు. పోలిగాడు కరగలేదు... కాళ్ళని బలంగా విదిలించుకుంటూ ఎ(ర్రప్పడి నెత్తిమీద, కొబ్బరి చెక్కతో బలంగా ఒక్క దెబ్బ కొట్టాడు. మాడు పగిలేలా మరొకసారి లాగిపెట్టి కొట్టాడు.. దెబ్బమీద దెబ్బ... దెబ్బమీద దెబ్బ... పోలిగాడు కొబ్బరి చెక్కతో, ఎ(ర్రప్పడి నెత్తిమీద కొడుతూనే ఉన్నాడు. "సచ్చిపోనా(న్రోయ్! దేవుడో!" ఎ(ర్రప్పడు చావుకేకలు పెడుతున్నాడు. గొంతు పెంచి గగ్గోలు పెడుతున్నాడు. పోలిగాడు కొట్టడం మానలేదు.

ఆ దృశ్యం దారుణంగా ఉంది.... దయనీయంగా ఉంది... ! పోలిగాడు పూనకం వచ్చినట్లుగా కొబ్బరి చెక్కతో కొడుతూంటే ... బాధను భరించలేక ఎ(ర్రప్పడు ఏడుస్తూ వాడి కాళ్ళను వదిలేశాడు.... పోలిగాడు, పెద్ద పెద్ద అంగలతో అక్కడ్నుంచి పారిపోయాడు. ఎ(ర్రప్పడు బూతులు తిడుతున్నాడు. తిడుతూ నెత్తిమీద తడుముకుంటున్నాడు. ఎ(ర్రటి రక్తం వాడి రెండు చేతులకీ అంటుకుపోయింది. అది ధారగా చెవులమీంచి చెంపల మీదకు కారుతోంది. " అమ్మోయ్! నా బుర్ర పగిలిపోనాది దేవుడోయ్!" ఎ(ర్రప్పడి ఏడుపు అరణ్యరోదనగా ఉంది. ఎవరూ వాడి ఏడుపును ఖాతరు చేయడం లేదు. రోడ్డు మీద వాహనాలు దూసుకుపోతున్నాయి. జనం ఎవరి మానాన వాళ్ళు నడిచిపోతున్నారు.... ఎ(ర్రప్పడి నెత్తి మండుతోంది. రక్తంతో వాడి చెంప తడిసిపోతూంది. ఎ(ర్రప్పడి గుండె మండుతూంది. వాడికి తల్లి గుర్తుకు వచ్చింది... తల్లి తెచ్చే పాచిపోయిన అన్నం, కంపు కొట్టే కూరలు జిహ్వాలో మెదిలాయి.. కోడికూర తినాలన్న కోరిక కందిరీగై కుడుతుంది. దిష్టి కొబ్బరి చెక్కలు దొరక్కుండా అడుగడుగునా అడ్డుతగిలిన పోలిగాడు... నెత్తి మీద కొబ్బరి చెక్కతో కొట్టిన పోలిగాడు... తన రక్తం కళ్ళ చూసిన రాకాసిబల్లి లాటి పోలిగాడు... గేలి చేస్తూ కళ్ళ ముందుఅగుపడుతున్నాడు... ఒరేయ్ ! పోలిగా! దొంగ నంజికొడగా! నీ రకతం కళ్ళ సూత్తానొరేయ్! నానూ నీ బుర్ర బద్దలుకొడతా(న్రొరెయ్!"

ఎ(ర్రప్పడు పిచ్చిగా ఏడుస్తూ పరుగెడుతున్నాడు... వెక్కి వెక్కి పడుతున్నాడు. వాహనాల్ని, మనుషుల్ని తప్పించుకుంటున్నాడు. రోడ్డుకు రెండువైపులా వున్న దుకాణాల్లోకి కళ్ళు విప్పార్చుకుని చూస్తున్నాడు. ఎక్కడా పోలిగాడి జాడలేదు. గౌరీ, వరాలు, బాటా చెప్పుల దుకాణం ముందు కొబ్బరి చెక్కల్ని లెక్కబెట్టుకుంటున్నారు. వాళ్ళకి ఆ కొట్టు

ముందు నాలుగు కొబ్బరి చెక్కలు దొరికాయి. వాళ్ళ కళ్ళల్లో కొవ్వొత్తులు వెలుగుతున్నాయి.

నర్సిగాడు 'రాజు భవన్' మెట్ల ముందు పడిగాపులు కాస్తున్నాడు....

మిగతా కుర్రాళ్ళు కొందరు 'పులవర్తి' వాళ్ళ అరుగుమీద అలుపు తీర్చుకుంటున్నారు. ఇంకా మరికొందరు, జట్లు, జట్లుగా కొబ్బరి చెక్కల కోసం పరుగు పందెంలో పోటీలు పడుతున్నారు. పెద్దబజారు పొడవునా వందలాది దుకాణాలు., ఆదిష్టి కొబ్బరి చెక్కల కోసం... దీనంగా ... ఆశగా... నిరాశగా... ఆడ, మగా పిల్లలు.

రాత్రి పది గంటలయింది.!

గంట క్రితం... అయిదుగురో, ఆరుగురో కొట్ల ముందు కనిపించిన, ఆడ మగా పిల్లలు, ఏ సందుల్లోంచి, ఏ గొందుల్లోంచి పుట్టుకొచ్చారో.. పాతిక ముప్పై మంది వరకూ, రోడ్డు పొడవునా కనపడుతున్నారు.

వాళ్ళల్లో ఎక్కడా పోలిగాడి జాడలేదు... ఎర్రప్పుడు పోలిగాడి ఆచూకి గురించి వరాల్ని అడిగాడు. గౌరిని అడిగాడు. వాడు తన నెత్తి మీద కొబ్బరి చెక్కతో ఎంత గట్టిగా కొట్టాడో... ఎంత రక్తం వచ్చిందో ఏడుస్తూ చెప్పాడు. వాళ్ళు జాలిగా చూశారు. నర్సిగాడ్ని అడిగాడు. మిగతా కుర్రాళ్ళని విచారించాడు... ఎవరూ పోలిగాడి గురించి చెప్పలేకపోయారు. ఎర్రప్పుడు, ముందుకు పరుగెత్తాడు. వరుసగా పూలకొట్లు దాటాడు. పట్నాల చిట్టియ్య బంగారపు కొట్టు ముందు ఆగాడు. ఆయాసం తీర్చుకున్నాడు. బాదం వారి సందులోకి దృష్టిని సారించాడు. దేవాలయం రోడ్డువైపు మళ్లాడు. నాలుగు వీధులు... ఒకటి తరువాత ఒకటి .. వరుసగా విసుగు లేకుండా వెదికాడు. ఎక్కడా పోలిగాడు లేడు... ఏడీవాడు? ఏంవయ్యాడు? ఎక్కడికి పోయాడు? " ఎలాగైనా పోలిగాడ్ని పట్టుకోవాలి.. వాడి మీద కసి తీర్చుకోవాలి. కొబ్బరి చెక్కతో తనూ వాడి బుర్ర పగలగొట్టాలి"

ఎర్రప్పుడిలో దుఃఖం పొర్లుకు వస్తోంది. నీరసం, నిస్సహాయత ఆవరిస్తూ ఉన్నాయి. అయినా, కాళ్ళల్లోకి సత్తువను కూడదీసుకుని ఎర్రప్పుడు మళ్ళీ పరుగు తీశాడు... తిరిగి పెద్ద బజారు రోడ్డులోకి వచ్చాడు. దాదాపు దుకాణాలన్నీ మూతలు పడ్డాయి. అలసటగా, ఆయాసంగా" ఉడిపి గణేష్" వద్దకు వచ్చాడు. బొంబాయి భవన్ దాటి జైన్‌సిల్క్‌ప్యాలెస్ ముందు ఆగాడు. ఆప్కో దుకాణం సందు మొదట్లోకి చూశాడు... అదిగో అక్కడ పోలిగాడు కనిపించాడు.

ఎర్రప్పుడు కళ్ళు చికిలించాడు. అల్లంత దూరంలో పోలిగాడు. ఎర్రప్పుడు భయం భయంగా ఒక అడుగు వెనక్కి వేశాడు వాడి కళ్ళు బైర్లు కమ్మాయి, వాడు కెవ్వుమని కేక పెట్టాడు. ఆ సందు మొదట్లో రోడ్డు వార ఫుట్‌పాత్ అంచున ... పోలిగాడూ వెల్లకిలా పడుకుని ఉన్నాడు. అక్కడ రోడ్డు మీద రక్తం గడ్డకట్టుకుపోయింది. ఆ రక్తంలో తెల్లటి కొబ్బరి చెక్కలు, చిందర వందరగా పడి, ఎర్రగా మెరుస్తున్నాయి.

పోలిగాడి బుర్ర కొబ్బరి చెక్కలా పగిలి పోయి ఉంది... ఆ దృశ్యం బీభత్సంగా ఉంది.

" పాపం! కొబ్బరి చెక్కల కోసం అడ్డంగా పరుగెట్టి యమహా మోటారు సైకిల్ని గుద్దుకుని అదిగో ఆ కరెంటుస్తంభం దిమ్మ మీదకు ఎగిరిపడ్డాడట... ఎవడో ఏ అబ్బకొడుకో... వెంటనే గిలగిలా కొట్టుకుంటూ చచ్చిపోయాడు..."

"దిష్టి తీసిన కొబ్బరి చెక్కలు ఏరు కుంటారు... ఇలా దిక్కుమాలిన చావు చస్తుంటారు.... ఆదిష్టి తగలకుండా ఉంటుందా ?"

"వీళ్ళకు ప్రాణాలంటే లక్ష్యం ఉండదండీ... తల్లీ తండ్రీ ఉండరు.. ఉన్నా పట్టించుకోరు...'

"ఎంత దారుణంగా చచ్చాడో" చూడలేక పోతున్నాం.. కుక్కచావు అంటే ఇదేనేమో దేవుడా ... !"

ఫుట్‌పాత్ మీద జనం, మాటలు, వ్యాఖ్యానాలు.. ఛీత్కారాలు...!

ఎర్రప్పడు ఎగ ఊపిరి దిగఊపిరి తీస్తున్నాడు.. ఎదురుగా వాడి కళ్ళ ముందు పోలిగాడు భయానకంగా... బీభత్సంగా ఎర్రగా రక్తపు ముద్దలా... పోలిగాడు సచ్చిపోవడం ఏటి.. ? ఆడి బుర్ర కొబ్బరి చెక్కలా పగిలి పోవడం ఏటి... ? ఆడికి దిష్టి తగిలినాదా ... ? ఏదిష్టి తగిలినాది? ఎవుడి దిష్టి తగిలినాది... ? తన దిష్టేనా... ? తన నెత్తిమీద కొబ్బరి సెక్కతో కొట్టినందుకేనా... ? పోలిగాడి చావు ఎర్రప్పడికి అర్థం కాలేదు.. ఆలోచించే శక్తి చాలలేదు... వాడి కళ్ళు తిరుగుతున్నాయి.. ఒళ్ళు తూలుతోంది..కడుపులో కెలికినట్లయింది. తల గిర్రున తిరిగినట్లయింది.

పోలిగాడి శవాన్ని చూస్తూ ఎర్రప్పడు దబ్‌మని నేల మీద పడిపోయాడు...!

❀ ❀ ❀ ❀ ❀ ❀

ఉదయం అయిదు గంటలయింది. తెల తెల వారుతోంది....!

అప్పలశెట్టి భారీకాయంతో, ఆవులిస్తూ పక్కమీంచి లేచాడు. అడుగులో అడుగు వేస్తూ కిరాణా కొట్టు వెనుక దొడ్డివైపు ఆవరణలోకి వచ్చాడు. తాతల నాటి వాలు కుర్చీలో "ఏడుకొండల వాడా ! వేంకటేశా !" అనుకుంటూ చెంపలేసుకుని అందులో చేరగిలపడ్డాడు...

పని వాళ్ళెవరూ, ఎనిమిది దాటితే గాని రారు. అంతవరకూ చిన్నా చితకా పనులు అప్పలశెట్టే చూసుకుంటాడు... ప్రక్క గదిలోంచి భార్య మాణిక్యం గురక విరామం లేకుండా వినబడుతోంది.... ఆవిడా ఏడు దాటితే గాని లేవదు.

కిరాణా కొట్టు వెనుక, ఆగ్నేయ దిశలో చిన్న నూనె మిల్లు ఉంది. మిల్లు నానుకుని వరుసగా జిడ్డోడుతున్న నూనె డబ్బాలున్నాయి... ఒక మూల, అపరాల బస్తాలున్నాయి... ఆ పైన విస్తరాకుల కట్టలున్నాయి.... ఇంకా రకరకాల కిరాణా సామాన్లు అస్తవ్యస్తంగా...

కొన్ని ఒక దానిమీద ఒకటి పేర్చి ఉన్నాయి.

అప్పలశెట్టికి రాత్రి ఒంటిగంటకు నిద్రపడుతుంది. మళ్ళీ రెండు గంటలకోసారి మెలకువ వస్తుంది. అతగాడికి రక్తపు పోటు ఉంది.... డాక్టరు మూడు పూటలా మూడు మాత్రలు మింగమంటూ ఉంటాడు. అప్పలశెట్టికి బద్ధకం ఎక్కువ... మింగితే ఒకేపూట మూడు మాత్రలు ఒకేసారి మింగుతాడు.. తన మీద తనకు నమ్మకం ఎక్కువ... ఇంట్లో భార్యనీ నమ్మడు... వీధిలో డాక్టర్నీ నమ్మడు.

అప్పలశెట్టికి ఆకలీ ఎక్కువే... రాత్రిపూట నాలుగు చపాతీలు తింటాడు. రెండు గ్లాసుల పాలు త్రాగుతాడు. మరో రెండు గ్లాసులు మజ్జిగ త్రాగుతాడు. మెలకువ వచ్చినపుడల్లా కొట్లో ఏదో ఒక తినుబండారం నోట్లో వేసుకుంటాడు.

అప్పలశెట్టికి అసంతృప్తీ ఎక్కువే... రక్తం మరిగిన పులిలా నిత్యం వ్యాపారంలో లాభాల కోసం రగులుతూ ఉంటాడు. అతనికి కిరాణా కొట్టు నూనెమిల్లుతో బాటు స్థానికంగా ఉన్న సినిమాహాలులో చిన్న వాటా ఉంది... రెండు చిట్‌ఫండు కంపెనీల్లో భాగస్వామ్యమూ ఉంది. ముగ్గురు కొడుకులూ, ఇద్దరూ కూతుళ్ళు. ముగ్గురు కొడుకులకూ పెద్ద బజర్లో బంగారపు కొట్లున్నాయి. ఇద్దరు అల్లుళ్ళకీ విడివిడిగా బట్టల షాపులున్నాయి. ఆస్థి పంపకాలు జరగలేదు. అవసాన దశలోగాని వీలునామా రాయనని అప్పలశెట్టి షరతు పెట్టాడు. అంతా స్వార్జితం... కొడుకులు కూతుళ్ళూ కిమ్మనలేదు.

అప్పలశెట్టి భారంగా కుర్చీలోంచి లేచాడు... బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు. పర్వతం కదిలినట్లుగా నడిచి దొడ్డివైపు తలుపులు రెండూ బార్లా తెరిచాడు. తలుపులు తెరిచి తెరవగానే ముప్పైమంది ఆడ మగా పిల్లలూ బిలబిలమంటూ నూనెమిల్లు ఆవరణలోకి వచ్చారు...

"బేగీ కానీయండ్రా!" అప్పలశెట్టి అరుస్తూ వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. పిల్లలందరూ క్యూలో నిలబడ్డారు. వాళ్ళందరి చేతుల్లోనూ సిమెంటు గోనె గుడ్డ సంచులున్నాయి. వాళ్ళ ముఖాలు దిగులుగా ఉన్నాయి. ఒకరి తరువాత ఒకరు తమ చేతుల్లోని గోనె సంచులు ఒంపుతూ విదిలిస్తున్నారు.

సంచుల్లోంచి కొబ్బరిచెక్కలు, చప్టా మీదకు రాలిపడుతున్నాయి.

నర్సిగాడివి పెద్ద చెక్కలు, ఆరు చిన్న చెక్కలు, మూడు గౌరివి అయిదు పెద్ద చెక్కలు, నాలుగు చిన్న చెక్కలు, వరాలువి ఏడు పెద్దవి, మూడు చిన్నవి....

అప్పలశెట్టి అట్ట మీద క్లిప్పుకున్న తెల్లకాగితపు ముక్కపైన వరుసగా పిల్లల పద్దులు రాస్తున్నాడు.. అరగంటలో అందరి పద్దులూ పూర్తయ్యాయి.

కొబ్బరిచెక్కలన్నీ చప్టా మీద గుట్టగా పోగుపడ్డాయి... ఆగుట్టను చూస్తూ అప్పలశెట్టి తృప్తిగా నిట్టూర్చాడు. ఆచెక్కలన్నీ ఎన్ని కేజీల నూనె అవుతుందో మనసులోనే అంచనా

వేసుకున్నాడు.... కులాసాగా కుర్చీలోంచి లేచాడు.

లోపల గదిలోకి వెళ్ళి ఒక కొబ్బరికాయను తెచ్చాడు. కళ్ళు మూసుకున్నాడు. కొబ్బరి కాయను దిష్టి తీసి, కొబ్బరి చెక్కల చుట్టూ తిప్పి చప్టా మీద కొట్టాడు. పిల్లలంతా మౌనంగా నిలబడి, అప్పలశెట్టి చర్యను వింతగా చూస్తున్నారు.. దిష్టి కొబ్బరి చెక్కలకు తిరిగి దిష్టి తీసిన అప్పలశెట్టి.. ఊరిచివర అమ్మోరి గుడి ముందు గణాచారిలా అగుపడుతున్నాడు... అప్పలశెట్టి ముఖం ఆనందంతో వెలిగి పోతూంది. అదిగో అప్పుడే.... ఎఱ్ఱప్పడూ నూనెమిల్లు ఆవరణలోకి ఆయాసపడుతూ వచ్చాడు.

" ఏరా! సెక్క లెయ్యి....? అప్పలశెట్టి బొంగురుగొంతుతో ఎఱ్ఱప్పడ్ని అడిగాడు. ఎఱ్ఱప్పడు మాట్లాడలేదు... ఏం గుర్తుకు వచ్చిందో... గొల్లుమని ఏడ్చాడు... వాడి కళ్ళ నుంచి బొటబొటా కన్నీళ్ళు రాలాయి....

"బాపూ! పోలిగాడు సచ్చిపోనాడు... మోటారు బండి గుద్దేసినాది. కొబ్బరి సెక్కల కోసం అడ్డంగా పరుగెట్టినాడంట... అన్నేయంగా సచ్చిపోనాడు... ఆడి అయ్యా, అమ్మా రోడ్డుమీద పడి ఏడుత్తన్నరు... మీరేదన్నా సాయం సెయ్యాల ...!"

ఎఱ్ఱప్పడి కళ్ళు... కన్నీళ్ళు ధారలు కడుతున్నాయి....

అప్పలశెట్టి కొన్ని క్షణాలు అవాక్కయి ఉండిపోయాడు.

రాత్రి మనవడు ముత్యాలరావు, యమహా బండి కొత్తగా కొన్న సరదాలో ... రోడ్డు మీద చక్కర్లు కొడుతూంటే... ఎవరో ముష్టి కుఱ్ఱాడు, ముందు చక్రాన్ని ఢీకొన్నాడనీ ఆగకుండా తను తప్పించుకుని వచ్చేసేనని వాళ్ళ నాన్నమ్మతో నవ్వుతూ చెబుతూంటే విన్నాడు... కొంపదీసి వాడే పోలిగాడా .. ? ఏమో... ? ఎందుకొచ్చిన గొడవ ... ?

అప్పలశెట్టి గుండె గుబగుబలాడింది...

" ఏఱ్రా! పోలిగాడు సచ్చిపోనాడా...? ఆడు సస్తే నివ్వెందుకేడ్వాల...? మీ అందరి దిష్టి ఆడికి తగిలినాది.. వోరం వోరం మిమ్మల్ని కొట్టేసి, నెట్టేసి కొబ్బరి సెక్కలన్నీ ఒల్లేసుకునేవోడు గాదా!... దురాశ మాలావయితే దిష్టి తగల్దేటి... ఒఱేయ్ ! ఎఱ్ఱప్పడూ! పోలిగాడు సస్తే సచ్చినాడు గానీ... పీడొదిలిపోనాది..రేపు సుక్కురారం కొబ్బరి సెక్కలన్నీ నీకే దొరుకతయ్యిలే ... ఎల్లెల్లు... సాయం నేదు, గీయం నేదు..." అప్పలశెట్టి కసురుకున్నాడు.

"బాపూ! పోనీ కొబ్బరి సెక్కకో అర్ధరూపాయి ఎక్కువిప్పిచ్చి పున్నెం గట్టుకోండి... మావందరం, పోలిగాడి సావుకు డబ్బులు దండతన్నం... ఆడి అయ్యకి అమ్మకీ... మీరిచ్చినారని..' ఎఱ్ఱప్పడు వేడుకోలుగా అన్నాడు.

" బాపూ! పోలిగాడి నాగే, దురాశ మాలావయితే... మావందరికీ దిష్టి తగులుద్దా?" ఎఱ్ఱప్పడు అమాయకంగా అడిగాడు. " దిష్టి తగల్దేటిరా.. ? తగులుద్ది..." అప్పలశెట్టి నొక్కి చెప్పాడు.

" బాపూ! తవరిలాంటి పెద్దోల్లకి దిష్టి తగుల్తాదా...?" ఎఱ్ఱప్పడికి ఎప్పుడూ రాని

సందేహం వచ్చింది...

" ఏట్రా ! పిచ్చి పిచ్చిగా వాగుతున్నావేటి... ? పో! ఇక్కడ్నుంచి.. మా కెందుకు దిష్టి తగుల్తాదిరా? తగలకుండా, దేవుడికి దణ్ణం పెట్టి కొబ్బరికాయలు కొడతన్నాం గాదా ... ? ఎల్లెల్లరా! ఎదవ సన్నాసి...." అప్పలశెట్టి గదమాయించి గద్దించి ఎర్రప్పడ్ని బయటకు పొమ్మన్నాడు.

ఎర్రప్పడు బయటకు పోలేదు.. "దిష్టి తగలకుండా మీ పెద్దోల్లంతా, కొబ్బరకాయలు కొడితే.. మావంతా ఏటి సేత్తాం బావూ...?" ఎర్రప్పడు తనలో తాను సణుక్కున్నాడు. గొణుకున్నాడు., మరుక్షణలో ఏమనుకున్నాడో.. చటుక్కున ఒంగి, అక్కడ పోగుపడ్డ కొబ్బరి చెక్కల గుట్టలోంచి... ఒక చెక్క తీసి అప్పలశెట్టి ముఖం మీదకు గురిచూసి విసిరాడు.... ఎర్రప్పడిని చూసి నర్సిగాడు, గౌరి వరాలు, మరొకడు, మరొకడు, ముప్పైమంది పిల్లలు, ఒకరి తరువాత ఒకరు, విసురుగా అప్పలశెట్టిని కొబ్బరి చెక్కలతో కొడుతున్నారు... కోపంతో, వాళ్ళ ముఖాలు ఎర్రగా ఉన్నాయి.

అప్పలశెట్టికి, ఊపిరి ఆడడం లేదు. అతను ఊహించలేదు... తను చిల్లర డబ్బులతో కొన్న దిష్టి కొబ్బరి చెక్కలు తన మీదకే విరుచుకుపడుతున్నాయి...!

గుండెపొరల్లో ఎక్కడో కలుక్కుమన్నట్లయింది. మరెక్కడో... మస్తిష్కపు పొరల్లో... పోలిగాడి చావుకి ఎంతో కొంత సాయం చేయాల్సింది అనిపించింది.

గొంతు విప్పి గట్టిగా, " పోలిగాడి చావుకి సాయం చేస్తానొరేయ్!" అంటూ అరవాలనిపించింది.

అప్పటికే... అప్పలశెట్టి గుండెను, పిల్లలంతా పిడికిళ్ళతో పిసికేసినట్లయింది...!

❀ ❀ ❀ ❀ ❀ ❀

("రచన" దీపావళి ప్రత్యేక సంచిక, నవంబరు - 2001)